క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



గద్వాల: జిల్లా రైస్ మిల్లర్ల ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామలింగేశ్వర కాంప్లే, జనరల్ సెక్రటరిగా సుదర్శన్, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాక్షులు నర్సింహులు, నారాయణ, జాయింట్ సెక్రటరీగా వినోద్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సతీష్‌కుమార్, స్వామి, దినేష్, ఈరన్న, మధన్ మోహన్ రెడ్డిని ఎన్నుకున్నారు. వీరికి పలువురు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు..

రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా శ్రీనివాసులు



ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు రగ్బీ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు రాష్ట్ర ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రామిరెడ్డి అందజేశారు. మేడ్చల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 11, 12వ తేదీల్లో అండర్–17 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధరూరు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, డీవైఎస్‌ఓ ఆనంద్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, పీఈటీ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, భరత్‌కుమార్, పీఈటీలు బీసన్న, సతీష్‌కుమార్, రజినీకాంత్ తదితరులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు శ్రీనివాసులును అభినందించారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ

ఎర్రవల్లి: యువతలో స్ఫూర్తి నింపడం కోసం మండల కేంద్రంలో మంగళవారం రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ. 80,000 నగదు, రెండో బహుమతిగా 40,000 నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9542079255 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇసుక తరలిస్తున్న బొలెరో పట్టివేత



ధరూరు: ధరూరు నుంచి గద్వాలకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని రేవులపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున మండల కేంద్రం వైపు నుంచి గద్వాలకు వెళ్తున్న క్రమంలో పెట్రోలింగ్ చేస్తుండగా పట్టుకున్నట్లు.. గద్వాల మండలం గోనుపాడుకు చెందిన రాములుపై కేసు చేసి వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్టు ఎస్సై షుకూర్ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం



కేటీదొడ్డి: ప్రమాదవశాత్తు సీడ్ పత్తికి నిప్పు అంటుకోవడంతో దగ్ధమైన ఘటన ఆదివారం కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాపురం రంగస్వామి తన ఇంట్లో పత్తి రాశిగా ఉంచాడు. ప్రమాదవశాత్తు పత్తి రాశికి నిప్పంటుకోవడంతో క్వింటాల్ పత్తి కాలిపోయింది. దీంతో లక్ష మేర నష్టం వాటిలిందని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం ధరూర్ మండలానికి చెందిన ఎరుకలి రాముడు గద్వాల నుంచి రాయిచూర్‌కు గూడ్స్ వాహనంలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పట్టణ శివారులో అదుపులోకి తీసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేలం నిర్వహణకు చోటేది ?

- వేలం నిర్వహణ స్థలం వివాదాస్పదం
- ఎటూ తేల్చని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు



వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్‌లో వేలం నిర్వహిస్తున్న కమిషన్ మర్చంట్ నిర్వాహకులు

అయిజ: మున్సిపాలిటీలో గత కొన్ని సంవత్సరాల నుంచి సాఫీగా సాగుతున్న కూరగాయల క్రయ, విక్రయాలకు ఇటీవల జరుగుతున్న సంఘటనలు వ్యాపారులకు శాపంగా మారాయి. గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్వహణ, సరైన వసతులు లేక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అనాలోచిత నిర్ణయాలు...

వాగు పక్కన లోతైన ప్రదేశంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నిర్మించడం, పెద్ద వాగుపై నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలం మరింత లోతులోకి పోయింది. దీంతో రోడ్డు పక్కన కూరగాయలు, పూలు, పండ్లు, మాంసం విక్రయించే వారు మున్సిపాలిటీకి రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి, ప్రతి నెలా అద్దె చెల్లించేందుకు సుముఖంగా లేరు.

సుముఖత చూపని వ్యాపారులు...

బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ. 50,000 డీడీ చెల్లించాలని, సాల్వేన్సీ సర్టిఫికెట్ విలువ రూ.5 లక్షలు ఉండాలని మొదటిసారి నిబంధన పెట్టారు. చిరు వ్యాపారులు ముందు రాకపోవడంతో డిపాజిట్‌ను రూ. 25,000కు, సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను రూ.2.50 లక్షలకు తగ్గించారు. సరిపడా ఖాళీ స్థలం లేక, సరైన రోడ్డు సదుపాయాలు లేకపోవడంతో వ్యాపారస్తులు, రైతులు ఆసక్తి చూపడం లేదు. చిరు వ్యాపారులు దరఖాస్తులు చేసుకునేందుకు ఎక్కువ ముందుకు రాకపోవడంతో కమిషన్ మర్చెంట్ వారితో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోనే వేలం కార్యకలాపాలు నిర్వహించేలా, చిరు వ్యాపారులు కూడా అక్కడే వ్యాపారం చేసుకునేలా బలవంతం చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేలం నిర్వహణకు సౌకర్యాలు లేవు..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయల వేలం నిర్వహణకు కావాల్సిన వసతులు లేవు. మార్కెట్ భవనాలు కట్టించినా సరైన వసతులు కల్పించడం లేదు. ముఖ్యంగా సరిపడా ప్రదేశం లేదు. అనేక గ్రామాల నుంచి రైతులు కూరగాయలను వివిధ వాహనాల్లో తరలిస్తుంటారు. వాహనాలు వచ్చేందుకు కూడా రోడ్లు బాగో లేవు.

– పుల్లా రెడ్డి, కూరగాయల కమిషన్ మర్చెంట్ నిర్వాహకులు

వాహనాలు ఇరుక్కుపోతాయి



ప్రతి రోజు పదుల సంఖ్యలో ఒకేసారి వివిధ గ్రామాల నుంచి కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు తీసుకొస్తుంటారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తే మాత్రం ట్రాఫిక్ జామ్ అవుతుంది. వాహనాలు తిరిగి బయటకు వచ్చే అవకాశం ఉండదు. వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లోనే సౌకర్యంగా ఉంది.

– ఆంజనేయులు, ఆటో డ్రైవర్

చిరు వ్యాపారులు సుముఖంగా లేరు..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్వహణకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చిరు వ్యాపారులు క్రయ, విక్రయాలు నిర్వహించేందుకు సుముఖంగా లేరు. బహిరంగ వేలం నిర్వహణలో పాల్గొనేందుకు పోటీ కనిపించడం లేదు. సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– రాజయ్య, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్

అభివృద్ధి పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: మండల కేంద్రంలో ఉప్పల రోడ్డు చౌరస్తా నుంచి ఉత్తనూరు రోడ్డు చౌరస్తా వరకు రోడ్డు విస్తరణతో పాటు డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆర్చీలు నిర్మించాలని, బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులు చేపట్టకుంటే బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో భీమసేనరావు, గోపాల కృష్ణ, వెంకటేష్, ప్రదీప్ కుమార్, మహేష్, జనార్ధన్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వబ్రాహ్మణులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని శ్రీవిరాట్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు డీకే విశ్వప్రకాష్‌ఆచారి కోరారు. ఆదివారం స్వర్ణకారులు, స్థానికులు నూతనంగా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన విశ్వప్రకాశ్‌ను సత్కరించారు. విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తాండూర్ కిషోర్, బాలు, అరుణ్, దివాకర్, నాగరాజు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పల్లయ్య

అయిజ: పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో ఆదివారం బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు దిష్టిబొమ్మ దహనం చేసినట్లు పల్లయ్య తెలిపారు. పల్లయ్యపై కేసు నమోదు చేశామని చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు శాంతినగర్ సీఐ టాటాబాబు పేర్కొన్నారు.

సర్వేలో పొరపాట్లకు అవకాశమివ్వొద్దు



మునుగాలలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేందర్



సింగవరంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మావతి

అలంపూర్‌రూరల్: కుల గణన సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా కొనసాగించాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. ఆదివారం మండలంలోని 14 గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇటిక్యాల: ఎలాంటి తప్పులు లేకుండా సమగ్ర కుటుంబ సర్వే చేయాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మునుగాలలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. పార్ట్–1లో యజమాని వివరాలు, పార్ట్– 2లో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, వార్షిక ఆదాయం, తదితర వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రెండో రోజు కొనసాగింది. ఎన్యుమరేటర్లు ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి యజమాని వివరాలతో పాటు కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, వార్షిక ఆదాయం తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. వల్లూరులో నిర్వహిస్తున్న సర్వేను ప్రత్యేక అధికారి రవికుమార్ (ఏఓ) పరిశీలించారు.

కేటీదొడ్డి: సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని నందిన్నె, మల్లాపురం, కేటీదొడ్డి, తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్‌ఐ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే ఆదివారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని సూచించారు. 23 తేదీ వరకు సర్వే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతినగర్ : సెలవు రోజైన ఆదివారం ఇంటింటి సర్వే కొనసాగింది. వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలు, మున్సిపాలిటీలో ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించారు. బుడమర్సు, తనగల, వెంకట్రామనగర్లలో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ రామకృష్ణ పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

అలంపూర్: మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ్మ అన్నారు. సర్వే వలన పట్టణంలో వివిధ సామాజిక, రాజకీయ అవకాశాలు మెరుగుపర్చడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయడానికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇంతియాజ్, సకీనాబీ, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



వల్లూరులో సర్వే చేస్తున్న అధికారులు



నందిన్నెలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



బుడమోర్సులో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



ఎల్‌ఓసి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేవిజయుడు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన ప్రత్యూష అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెకు శస్త్ర చికిత్స నిమిత్తం మంజూరైన రూ.5 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని కలుగోట్లలో బాధితురాలి తండ్రి రాజీవ్ బాబుకు ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మద్దిలేటి శ్రీనివాస్ రెడ్డి, మజీద్ మియా తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఇటిక్యాలలో ఓటింగ్ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేందర్

ఇటిక్యాల: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండల కేంద్రంతో పాటు మునుగాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారం–6 ద్వారా ఓటరు నమోదు, ఫారం– 7 ద్వారా అభ్యంతరాలు, ఫారం –8 ద్వారా అడ్రస్ మార్పు గురించి బీఎల్వోలకు వివరించారు. కార్యక్రమంలో బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



రామాపురంలో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. శాంతినగర్ పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టీకాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సురేష్

ఆత్మకూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు పూనుకుంటున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ ఆరోపించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఏఐటీయూసీ 105వ వారోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరించారు. కార్మిక చట్టాలు దోపిడి వర్గాలకు చుట్టాలుగా మారి నీరుగారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉండగా.. అమలు కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఈఎస్‌ఐ కార్డులు, ఆరోగ్యబీమా కల్పించాలని, భద్రత సామగ్రిని అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్తార్, బాలకృష్ణ, అరుణ్, బాలకిష్టమ్మ, పార్వతమ్మ, చెన్నమ్మ, బాల్‌రాజు, శ్రీకాంత్, మైనోద్దీన్ ఉన్నారు.

విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వబ్రాహ్మణులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని శ్రీవిరాట్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు డీకే విశ్వప్రకాష్‌ఆచారి కోరారు. ఆదివారం స్వర్ణకారులు, స్థానికులు నూతనంగా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన విశ్వప్రకాశ్‌ను సత్కరించారు. విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మొక్కలు నాటిన అయ్యప్ప మాలధారులు



మొక్కలు నాటుతున్న అయ్యప్ప మాలధారులు

అయిజ: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ పరిసర ప్రాంతంలో ఆదివారం స్వామి మాలధారులు మొక్కలు నాటారు. స్వామి వారి పూజల కోసం ఆలయం సమీపంలోనే పూల మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మమ్మ జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

ధరూరు: మండల పరిధిలోని మన్నాపురం గ్రామంలో లక్ష్మమ్మ ఊర జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మమ్మను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామానికి చేరుకున్న ఆడపడుచులతో పండుగ వాతావరణం నెలకొంది.

రైల్వే ఉద్యోగాల్లో తెలంగాణకు అన్యాయం



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: రైల్వే ఉద్యోగాల భర్తీలో కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల యువతకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి ఉద్యోగాల భర్తీకే 13 ప్రాంతీయ భాషల్లో రాత పరీక్షలు నిర్వహిస్తుంటే.. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు మాత్రం కేవలం ఇంగ్లిష్, హిందీ భాషల్లోనే పరీక్షలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో పరీక్షలను నిర్వహించడం ద్వారా కేవలం ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాల వారికే రైల్వే ఉద్యోగాలు వస్తున్నాయని, తెలుగు రాష్ట్రాల యువతకు మొండి చేయి చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డును ప్రక్షాళన చేసి అన్ని రాష్ట్రాల ప్రాంతీయ భాషల్లో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రవి, రాము, ఉదయ్, కిరణ్, మైబు, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి



అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: శ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి సంపూర్ణంగా సహకరించాలని మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, గాడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక అయ్యప్ప కాలనీలో రూ. 3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణానికి ఇది వరకే రూ.2 కోట్లు ఖర్చు అయ్యిందని, ఇంకా రూ.కోటి నిధులను విరాళాల రూపంలో అందిస్తే నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఈ నెల చివరి నాటికి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని, డిసెంబర్ రెండో వారంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయంలో దీక్షాపరులకు ప్రతినిత్యం భిక్ష అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే విరాళాలు ఇవ్వాల్సిన భక్తులు ఆలయ కమిటీ నిర్వాహకులకు నేరుగా లేదా ఫోన్‌పే 94411 61898 నంబర్‌కు డబ్బు పంపించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు జిన్నారం శ్రీను, కూరగాయల రఘు, దివాకర్, భరత్, కొత్తబోయ శేఖర్ తదితరులు ఉన్నారు.